# అనుభవం



పౌర్ణమి కావడంతో వెన్నెల అందంగా, హాయిగా ఉంది. సముద్రతీర ప్రాంతంలో వెన్నెల మరింత అందంగా ఉంది. ఆ సముద్రపు ఒడ్డున ఏళ్ల తరబడి నివాసముంటున్న కుటుంబాలకు సముద్రపు హోరు సంగీతపు ధ్వని. వేద ఘోషలో భగవంతుడిని అర్చిస్తున్నట్లు ఉండే ఆ ధ్వనిలోనే వాళ్ల జీవనయాత్ర సాగుతుంది. పూరిగుడిసెలే ఇంద్రభవనాలుగా, చేపల వేటనే వృత్తిగా స్వీకరించిన జాలర్ల నివాసమది.

పట్టణానికి దూరంగా ఉన్న రేవు ప్రాంతం కావడంతో అప్పుడప్పుడూ విహారానికి జనం వస్తూంటారు.

పాతిక, ముప్ఫై కుటుంబాలు కలిసి కట్టుగా నివాసముంటూ, ప్రత్యక్ష దైవంగా సముద్రాన్నే కొలుస్తూంటాయి.

వయసు మీదపడడంతో రామయ్య చేపల వేట మానుకున్నాడు. జీవితంలో ముప్పావుభాగం వేటలోనే గడిచిపోయింది. కొడుకులతో పాటు కుర్రాళ్లందరూ చీకటి తోటే సముద్రంమీద వేటకు బయలుదేరతారు. రామయ్య దినచర్య మాత్రం సముద్రంతో ఊసులాడడమే. కథలు కథలుగా జ్ఞాపకాలు తవ్వితీస్తున్నట్లు మైమరచిపోయి చూస్తాడు సముద్రంకేసి.

అటు, ఇటూ దొర్లుతున్నా నిద్రపట్టడం లేదు. వినిపించే సముద్రపు హోరులో మార్పు కనబడింది. విగసిపడే కెరటాల హోరు వినిపించే ధ్వనిలో తేడా తెలుస్తోంది. ఎనభై సంవత్సరాలుగా పెనవేసుకుపోయిన శబ్దమది.

చేతికర్ర సాయంతో సముద్రంకేసి నడిచాడు రామయ్య. దగ్గరకు వెళ్లగానే ఆడుతూ, పాడుతూ తెల్లని నురగలతో పాదాలు తడిపే కెరటాల జాడలేదు. తడితడిగావున్నా సముద్రం కొన్ని అడుగులు వెనక్కి మళ్లినట్లుంది. హఠాత్తుగా జరిగిన మార్పు ఏ ఉపద్రవానికి సంకేతమో?

వాడవల్లి విజయలక్ష్మి

సముద్రం అలజడి లేకుండా గంభీరంగా ఉన్నట్లు అన్పిస్తూంది. ముసలి రామయ్య జీవిత కాలంలో ఎన్నడూ చూడని వింత యిది. తాత చెప్పిన సముద్ర ప్రళయాలు గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. తల్లిలాంటి ప్రకృతిలో ఏదో అపశృతి ధ్వనిస్తోంది. అనుభవం నేర్పిన పాఠాలు ఎన్నో. అందుకే జాగ్రత్త అవసరం అన్పించింది.

పరుగులాంటి నడకతో గూడేనికి చేరాడు. వెనక్కి వెళ్లిన సముద్రం మరింత తీవ్రంగా ముందుకు రావచ్చు. ఇళ్లొదిలి గుట్ట దగ్గరకు వెళ్లండి... రామయ్య హడావుడి పడుతున్నాడు.

రామయ్య ఆదుర్దాను అంతగా పట్టించుకోలేదు అక్కడివారెవ్వరూ.

"మీ రోజులు కాదు ఇప్పుడు. ఏమాత్రం తేడా ఉన్నా టీవీ, రేడియోల్లో చెప్పేస్తారు. గవర్నమెంట్ అన్ని జాగ్రత్తలూ తీసుకుంటుంది. చాదస్తపు మాటలు వద్దు" తేలిగ్గా తీసేసారు కుర్రాళ్లు.

రామయ్య కొడుకులతో పాటు మరికొందరు 'వల'లను పడవలకెక్కించి సముద్రంమీద వేటకు బయల్దేరారు.

"ఒరేయ్! ఈ ముసలాడి మాట వింటే వచ్చే రాబడి సున్నాయే" నాటు పడవలు బయల్దేరాయి. అలల మీద తేలిపోతూ సాగిపోతున్నాయి పడవలు.

రామయ్య అందరికీ పదే పదే చెప్తూనే ఉన్నాడు.

పౌర్ణమి కావడంతో స్నానాలతో పవిత్రమవుదామని వచ్చిన జనంతో సందడి మొదలయింది. మరికొంతమంది సముద్రపు ఒడ్డున విహారం చేస్తున్నారు.

తూరుపు తెల్లవారింది. రేడియోలో ఏ హెచ్చరికలూ లేవు. గూడెంలో అందరూ యథావిధిగా ఎవరి పనుల్లో వాళ్లుండిపోయారు. కానీ రామయ్య మనస్సు కుదురులేదు. కాస్త గంజి కూడా తీసుకోలేదు. మసకబారిన కళ్లకు చేయి అడ్డం పెట్టుకుని సముద్రంకేసే గుచ్చి గుచ్చి చూస్తున్నాడు.

ఉన్నట్టుండి సుదూరంగా సముద్రంలో పెద్ద గోడ మాదిరిగా ఏర్పడిన అల కనబడింది. పగబట్టిన త్రాచులాగా మీదకురికేందుకు సిద్ధంగా ఉన్న పెద్ద కెరటం జాడ కనబడడంతో రామయ్య తన బొంగురు గొంతుతో ఒక్క కేక పెట్టాడు.

"సముద్రం వచ్చేస్తూంది, పరిగెత్తండి, పరిగెత్తండి!" పిల్లలను, పెద్దలనూ హడావుడి చేసి దగ్గరలో ఉన్న గుట్ట వద్దకు పరుగుపెట్టిస్తున్నాడు. అక్కడ ఉన్న జనం గాభరాతో ఒకళ్లను త్రోసుకుంటూ మరొకళ్లు పరుగులతో ఆయాసపడిపోతున్నారు. వెనక్కి తిరిగి చూస్తే కెరటం వేగం మరింత ప్రస్ఫుటంగా కనబడుతూంది. చెల్లాచెదురైన జనం పరిగెడుతూనే ఉన్నారు. సుమారు ఇరవై మీటర్ల ఎత్తున్న అలతో సముద్రం ఆ ప్రదేశాన్ని ముంచెత్తేసింది. గుట్టమీదకు చేరినవాళ్లు ప్రాణాలు బిగబట్టి చూస్తున్న దృశ్యం... అంతా కన్నుమూసి తెరిచేంతలో జరిగిన జలప్రళయం. సముద్రం ఆ క్షణంలో తనలో ఎన్నిటినో కలిపేసుకుంది? ఎగిసెగిసిపడుతున్న కెరటాలు... భీభత్సాన్ని సృష్టించిన సముద్రానికి హద్దులేమిటి? ఎన్నో గ్రామాలు, వేల మంది జనం సముద్రంలో కలిసిపోయారు.

వేటకు వెళ్లిన కుర్రాళ్లు రామయ్య హెచ్చరికతో సముద్రం తీరుతెన్నులు చూసి కాస్తంత ముందుగానే వెనుతిరిగివచ్చారు.

మొత్తానికి ఆ రేవు ప్రాంతంలో ప్రాణనష్టం




జరగలేదు. కాస్తంత చైతన్యం వచ్చాక ముందు గానే తమని మేల్కొల్పిన రామయ్య కోసం వెది కారు.

తమ బంధువుల జాడ కనుక్కుంటూ కాస్తంత ఊపిరి పీల్చుకున్నారు. గుట్ట క్రింద అంతా సముద్రమే. వయస్సు మీదపడిన ఆ ముసలి రామయ్య తనని తాను రక్షించుకోగలిగాడా? అర్ధరాత్రి నుంచి సముద్రంలో మార్పులను పసిగట్టి పేరుపేరునా అందరినీ హెచ్చరించి జాగ్రత్తపరిచిన రామయ్య జాడ ఏది?

వెదుకుతున్న వాళ్ల కళ్లకు దూరంగా ఎత్తైన చెట్టుమీద రామయ్య కనబడ్డాడు. చేతుల్లో ఇద్దరు పిల్లలను ఒడిసిపట్టుకుని చెట్టుపై కుదురుగా కూర్చుని చేతులూపుతున్న రామయ్య అందరి యోగక్షేమాల కోసం ఎంత ఆరాటపడ్డాడు?

రేడియోలో సునామీ హెచ్చరికలు మొదలయ్యాయి. తమ యిద్దరి పిల్లల కోసం ఆరాటపడే తల్లి రామయ్య చేతుల్లో పిల్లలు కనిపించడంతో చేతులెత్తి దణ్ణంపెట్టింది.

అనుభవం నేర్పిన పాఠంతో తనను తాను రక్షించుకుని, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని రక్షించుకునేందుకు ముందు జాగ్రత్తలు చెప్పే రామయ్యవంటి వారు ఎవ్వరి కోసమూ ఎదురు చూడరు.

సునామీ హెచ్చరికల మధ్య గవర్నమెంట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. భయంతో బిగుసుకుపోయిన జనాన్ని రక్షించేందుకు జీపుల్లో పరివారం బయల్దేరింది. అందుబాటులో వున్నవారిని ఊళ్లోకి చేరవెయ్యడం మొదలు పెట్టారు.

నాలుగైదు గంటలు గడిచాక శరీరంలో శక్తిని కూడగట్టుకుని చిన్నపిల్లలను వీపుకెత్తుకుని అతి కష్టంమీద గట్టుకు చేరాడు రామయ్య. అవాక్కయిన ప్రజానీకం రామయ్య చేసిన మేలుని తలచుకొని, అతనికి చేతులెత్తి నమస్కరించారు. ●